క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



కిషన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన నల్ల కిషన్ (40) ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. 40 ఏళ్ల కిషన్ గుండెపోటుతో మృతిచెందడం ఆందోళన కలిగిస్తోందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మీసేవా నిర్వాహకుడు మాటేటి చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

ధర్మాన్ని ఆచరించి ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సత్యాంద ఆశ్రమ పీఠాధిపతి

కథలాపూర్: ప్రజలు ధర్మాన్ని ఆచరించి ముందుకు సాగాలని పడిగెల సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద తీర్థస్వామి అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో శ్రీ సత్యాంద మహర్షి 492వ సంచార సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోటీ ప్రపంచంలో ఆర్థికంగా ఎదగాలని ప్రజలు దైవ కార్యక్రమాలను మరిచిపోతుండటం బాధకరమన్నారు. ప్రతీ వ్యక్తి తల్లిదండ్రులను, దేవుడిని మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి విశోక తీర్థస్వామి, హరిప్రియ మాతాజీ, భక్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మల్లాపూర్: మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు క్లోం మహిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించి మొక్కజొన్న పంట చేతికొచ్చి నెల రోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. ఇదే అదనుగా రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను మద్దతుధర కంటే తక్కువగా దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.


కంపోస్టుయార్డుకు బతుకమ్మ పూలు



పూలను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలో శనివారం సద్దుల బతుకమ్మ పండుగ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక బతుకమ్మ ఘాట్‌లో వాటిని నిమజ్జనం చేయడంతో అది పూలతో నిండిపోయింది. ఆదివారం ఆ పూలను మున్సిపల్ సిబ్బంది కంపోస్ట్ యార్డుకు తరలించారు. అక్కడ వాటిని ఎరువుగా తయారు చేసి మొక్కలకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు.

పిచ్చిమొక్కల మధ్య ఓపెన్ జిమ్



రాయికల్: పట్టణ ప్రజలు వ్యాయమం చేసుకునేందుకు ప్రారంభించిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. ఓపెన్ జిమ్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో వ్యాయమం చేసేందుకు వచ్చే వాకర్స్, మహిళలు పాములు, తేళ్ల భయంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఓపెన్ జిమ్‌లో ఉన్న పరికరాలు సైతం సరిగా పనిచేయకపోవడంతో పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకం పశువుల తొట్టి వద్ద ఉండటం మున్సిపల్ కమిషనర్ పనితీరుకు నిదర్శనంగా మారింది. ఇప్పటికైనా కమిషనర్ మనోహర్‌గౌడ్ స్పందించి ఓపెన్ జిమ్ చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు చేపట్టి శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని వాకర్స్, స్థానికులు కోరుతున్నారు.

అంతిమ సంస్కారాలకు అవస్థలు

- వైకుంఠధామాల్లో కనీస వసతులు కరువు
- సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

కథలాపూర్: అంతిమ సంస్కారాలైనా సాఫీగా జరిపిస్తే ఆత్మ సంతృప్తి చెందుతుందని, బంధువులకు తిప్పలు తప్పుతాయనే ఉద్దేశంతో గత ప్రభుత్వం హయంలో 2019–2020 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ. 10 లక్షలు వెచ్చించి గ్రామానికో వైకుంఠధామం(స్మశానవాటిక)లు నిర్మించారు. వాటి నిర్వాహణను విస్మరించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

19 గ్రామాల్లోనూ తిప్పలే...

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. ఈ వైకుంఠధామాల్లో స్నానాలు చేసేందుకు వీలుగా నీటి సౌకర్యం, గదులు నిర్మించారు. రాత్రివేళల్లో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తే ఇబ్బందిగా ఉండవద్దని సోలార్ లైట్లను బిగించారు. పలు గ్రామాల్లో నాసిరకం పనుల వల్ల కొన్నిరోజులకే నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు చెరువులు, వాగు ఒడ్డున నిర్మించడంతో దారి కరువై పంటపొలాల నుంచి వెళ్లాల్సి దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. వైకుంఠధామాల వద్ద నీటి వసతి లేకపోవడంతో స్నానాల కోసం పంట పొలాల్లో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సోలార్ లైట్లు పనిచేయడం లేదని, ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలంటున్నారు. వైకుంఠధామాల ఆవరణలో నిర్మించిన స్నానాల గదులు పేకాట రాయుళ్లకు, మందుబాబులకు అడ్డాగా మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి వైకుంఠధామాల వద్ద కనీస వసతులు కల్పించాలని, మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



భూషణరావుపేటలో వైకుంఠధామంలో దహనవాటిక కూలిన పైకప్పు



భూషణరావుపేట వైకుంఠధామంలో కూలిన దహనవాటిక పైకప్పు

వాగులో నిర్మించడంతో కూలిపోయింది



బొమ్మెనలో వాగు ఒడ్డున వైకుంఠధామం నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వైకుంఠధామం పిల్లర్లు, గదులు కూలిపోయాయి. అధికారులు ఆలోచించకుండా వాగు ఒడ్డున వైకుంఠధామం నిర్మించడం వల్లే ఈ సమస్య తలెత్తింది. కనీసం రోడ్డు సౌకర్యం లేదు. కొత్తగా వైకుంఠధామం నిర్మించి వసతులు కల్పించాలి.

– గట్ల గంగాధర్, బొమ్మెన

చర్యలు తీసుకుంటాం



వైకుంఠధామాల వద్ద కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నీటి వసతి లేకుంటే తాత్కలికంగా గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు సూచిస్తాం. సోలార్ లైట్లు, ఇతర నిర్మాణాల మరమ్మతులుంటే త్వరగా చేయిస్తాం.

– రాజశేఖర్, మండల పంచాయతీ అధికారి, కథలాపూర్

'కాకా' సేవలు మరువలేం



ధర్మపురిలో కాకా జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి, నాయకులు

ధర్మపురి: దివంగత మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి ప్రజా శ్రేయస్సు కోసం చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. హైదరాబాద్‌లో 70 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఎస్ దినేష్, వేముల రాజు, చీపిరిశెట్టి రాజేష్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, కస్తూరి శ్రీనివాస్ తదితరులున్నారు.

కాకా ఆశయ సాధనకు కృషి చేద్దాం

కోరుట్లటౌన్: దివంగత మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాకా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ సంఘ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు బలిజ రాజరెడ్డి, ఉయ్యాల నర్సయ్య, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బద్ది మురళీధర్, ఇంద్రాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోరుట్లటౌన్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి ఆదివారం పేర్కొన్నారు. పట్టణంలోని నాగులపేట కమాన్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లారీ డ్రైవర్, లారీ ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి సంఘటనలో ఒకరికి గాయాలు

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం పైడిమడుగులో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం అర్ధరాత్రి దాడి సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం మేరకు పైడిమడుగు గ్రామానికి చెందిన తలారి వినయ్ అలియాస్ వినీత్ అదే గ్రామానికి చెందిన దుంపల రాజేష్‌పై పాత గొడవలు మనసులో పెట్టుకుని బీరుసీసా పగలగొట్టి దాడికి పాల్పడ్డాడు.ఈ సంఘటనలో దుంపల రాజేష్ మెడపైన తీవ్రగాయం కాగా జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తండ్రి గంగ నర్సయ్య ఫిర్యాదు మేరకు వినయ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో దాడి చేసిన ఇద్దరిపై కేసు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో మంతెన నవీన్ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన గోపు ప్రవీణ్, చెదలు సాయి కత్తితో దాడి చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి గ్రామ కూడలి వద్ద నవీన్, సాయిల మధ్య పాత గొడవల విషయంలో పరస్పరం దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో వివాదం ముదరడంతో నవీన్‌పై ప్రవీణ్, సాయిలు కత్తితో దాడి చేసి గాయపరిచారు. నవీన్ ఫిర్యాదు మేరకు సాయి, ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ వివరించారు.

భారతీయ జీవన విధానమే ప్రపంచానికి ఆదర్శం



జగిత్యాలలో హాజరైన స్వయం సేవకులు

జగిత్యాలటౌన్: ఎంతో ఉన్నతమైన భారతీయ జీవన విధానమే నేడు ప్రపంచానికి ఆదర్శమని దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ సాయి మధుకర్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లిలోని ఎల్‌జీ గార్డెన్లో బస్తీ విజయదశమి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన సాయిమధుకర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ జన్మతహా దేశభక్తుడని అన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్వయం సేవకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ నూతికట్ల సత్యం, ముఖ్య అతిథి వొద్దిపర్తి చిన్న సంతోష్ చార్యులు అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి నిస్వార్థంగా దేశాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పద సంచలన్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, సృజన్, వీరేందర్, సురేశ్, సునిల్, నర్సయ్య పాల్గొన్నారు.

మేడిపల్లి: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భీమారం మండలం గోవిందారం, మేడిపల్లి మండల కేంద్రం, కొండాపూర్‌లో విజయదశమి ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ గ్రామ గ్రామాన నిర్వహించి స్వయం సేవకులను చైతన్య పరచాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

'చాగంటి' ప్రవచనాలకు ఏర్పాట్లు

ధర్మపురి: ఈనెల 11,12 తేదీల్లో పట్టణంలో జరుగనున్న చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్ దినేశ్ తెలిపారు. ఆదివారం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ ఆహ్వానం మేరకు చాగంటి ధర్మపురి పుణ్యక్షేత్రానికి రానున్నట్లు తెలిపారు. ఈనెల 11,12 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు స్థానిక శ్రీమఠం స్థలంలో ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, నాయకులు వేముల రాజు, చిలుముల లక్ష్మణ్ తదితరులున్నారు.

సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు రాజ్యాంగాన్ని అవమానించడమే

జగిత్యాలటౌన్: ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడమంటే అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని అవమానించడమేనని కారంగుల వసంతరావు అన్నారు. జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్మరణ కార్యక్రమ నిర్వాహకులు నల్ల శ్యాం, మద్దెల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కొడిమ్యాల: మండల కేంద్రం నుంచి గోవిందారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయి గుంతలుగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు జారి పడుతున్నారు. రాత్రి వేళల్లో లైట్లు లేకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, సమీప గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లహరి, ఆర్‌అండ్‌బీ అధికారి, సెల్ నంబర్: 8374226433

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గ్రామాల్లో ఎంపీటీసీ ఆశావహుల సందడి

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీటీసీ ఆశావహుల సందడి నెలకొంది. మల్యాలలో రెండు ఎంపీటీసీ స్థానాలు, ముత్యంపేట, రామన్నపేట, రాంపూర్, రాజారంలో ఒక్కో ఎంపీటీసీ స్థానాలు బీసీలకు కేటాయించగా, పోతారం, బల్వంతాపూర్, మ్యాడంపల్లిలో ఎస్సీలకు, మల్యాల, తాటిపల్లి, మద్దుట్ల, లంబాడిపల్లి, తక్కళ్లపల్లి ఎంపీటీసీ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేపట్టి, స్థానిక సంస్థల్లో ఒకేవిధమైన రిజర్వేషన్లు రెండు పర్యాయాలు కొనసాగించాలని నిర్ణయించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ రిజర్వేషన్ ప్రక్రియను తొలగించి, నూతనంగా రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆయా గ్రామాల్లో ఎంపీటీసీలుగా, సర్పంచులుగా రెండు పర్యాయాలు రిజర్వేషన్లు అనుకూలంగా ఉంటాయనే భావనతో పనిచేసిన నాయకులు, రిజర్వేషన్లు తారుమారు కావడంతో తలలు పట్టుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉండే అభ్యర్థులను ఎంపిక చేసి, వారికే టికెట్ ఇప్పించేందుకు పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ ఏర్పాటు

పెగడపల్లి: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు యువజన సంఘాల సభ్యులు కలిసి ఆదివారం కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా ఉయ్యాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఉల్లెందుల రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా నేదరి సాయి కుమార్, కల్లెపల్లి సుధాకర్, పాదం కార్తిక్, మాదారపు కార్తిక్‌రావు, కోశాధికారిగా గొల్లపల్లి గంగసాగర్, సహాయ కార్యదర్శులుగా బండారి అఖిల్, కన్నం పవన్, దాసరి సాయికృష్ణ, బొమ్మెన నరేశ్, ప్రచార కార్యదర్శులుగా బోగ లతీశ్, సందవేని నవీన్, కమలాకర్, విక్రమ్‌ను ఎన్నుకున్నారు.

చైతన్య యూత్ కార్యవర్గం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో చైతన్య యూత్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెజ్జారపు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కమ్మంపెల్లి సంజీవ్, కోశాధికారిగా గట్ల కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా అందె రవి, కార్యవర్గసభ్యులుగా అంబల్ల కమలాకర్, బేతి శ్రీనివాస్, కొత్తపెల్లి రాజలింగం, బెజ్జారం శ్రీనివాస్ ఎన్నికయ్యారని సభ్యులు తెలిపారు.

బీడీ కాలనీ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని బీడీ కాలనీ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తూముల లింగమూర్తి, ఉపాధ్యక్షులుగా రాంపల్లి రాజేంద్రప్రసాద్, కార్యదర్శులుగా పరాంకుశం లక్ష్మీనర్సయ్య, బోదకం శంకర్, న్యాయ సలహాదారుగా మన్నె గంగాధర్, కోశాధికారిగా అల్లాడి ప్రణయ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా రంగు సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గౌడ కులస్తుల కార్యవర్గం

కొడిమ్యాల: గౌడ కుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గుర్రం లక్ష్మణ్,ఉపాధ్యక్షుడిగా గర్వందుల రాజమౌళి ఎన్నికయ్యారు.

పంచాతి బాలరాజు శాంతి అవార్డు



రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన పంచాతి బాలరాజుకు ఇంటర్నేషనల్ పీస్ అవార్డు ఆదివారం అందుకున్నారు. ఉదయం ఫౌండేషన్ నుంచి 60 మంది నిరుపేదలకు సామాజిక మాధ్యమాల ద్వారా సేవలందించినందుకు ఆయన సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చక్రవర్తి ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకుని అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా బాలరాజు గ్రామస్తులు అభినందించారు

పెద్దమ్మకు పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మకు పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు రెడ్డవేని రాజు, లక్ష్మన్న, తుక్కన్న, మహిళలు పాల్గొన్నారు.

దసరా పండుగ ఆనవాయితీ కొనసాగింపు

మల్యాల: మండల కేంద్రంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బురుజు వద్ద దసరా పండుగ ఆనవాయితీని కొనసాగించారు. ఏటా దసరా రోజు స్థానిక బురుజు వద్ద జంతు బలి ఇచ్చే ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. ఈ నెల 2న దసరా గాంధీ జయంతి రావడంతో జీవ హింస చేయకూడదని, వాయిదా వేశారు.ఆదివారం ఆనవాయితీని కొనసాగించారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.





పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాలటౌన్: ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1998–2001 బ్యాచ్ బీఏ,బీకాం, బీఎస్సీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జగిత్యాల పట్టణంలోని బూసి లక్ష్మీనారాయణ గార్డెన్స్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులను సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలనుగుర్తు చేసుకున్నారు. అనంతరం తమ మిత్రులతో కలిసి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అలిశెట్టి అనూరాధ, బండ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని బాలికలు ఉన్నత పాఠశాలలో 2006–07 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. చదువుతున్న సమయంలో చేసిన అల్లర్లను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు.

సౌదీ అరేబియాలో బతుకమ్మ వేడుకలు



దమామ్‌లో బతుకమ్మలతో మహిళలు, యువతులు

మల్లాపూర్: సౌదీ అరేబియాలోని దమామ్‌లోని సఫ్వా ఈస్ట్రన్ రీజియన్ పరిధిలో సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్(ఎస్ఎటీఏ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఎటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేశన్ బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయగా, వందలాది మహిళలు, యువతులు తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే ఆటపాటలతో మైమరిచిపోయి బతుకమ్మ సంబరాలను నిర్వహించుకున్నారు.